## క్లుప్తంగా

### భారతీయ సంస్కృతి చాలా గొప్పది



భారతీయ సంస్కృతిని వివరిస్తున్న విశ్వ మానవ సంక్షేమ సంఘం

**ఒంగోలు మెట్రో:** స్థానిక ప్రగతి కాలనీలో విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 25వ ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పెసల మస్తాన్‌రావు మాట్లాడుతూ.. పిల్లలు ఉన్నతమైన విలువలను నేర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని, మానవత్వం కలిగి ఉండాలని చెప్పారు. భారతీయ వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ చాలా గొప్పవన్నారు. తల్లిదండ్రులను అనాథాశ్రమాల్లో వేయడం మంచిది కాదని చెప్పారు. కొంగర నరసింహం, సంస్థ ముఖ్య కార్యదర్శి సూర్య కుమారి, సంస్థ కోఆర్డినేటర్ పులి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

### జేసీస్ ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్‌పై శిక్షణ

**ఒంగోలు:** స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో ఆదివారం పబ్లిక్ ఎఫెక్టివ్ స్పీకింగ్ కార్యక్రమాన్ని ఒంగోలు జూనియర్ ఛాంబర్ నిర్వహించింది. నేషనల్ ట్రైనర్ రాహుల్ 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జేసీస్ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ అందరికీ చాలా మంచిగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ శిక్షకునిగా రవికుమార్, పూర్వ అధ్యక్షులు కసిబిసి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

**జరుగుమల్లి:** మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీధర శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 20 మద్యం సీసాలు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై రాజేష్

**పొన్నలూరు:** మండలంలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో సీహెచ్ మాలకొండయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

**జరుగుమల్లి:** పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద చోటుచేసుకుంది. కావలి నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద టంగుటూరు నుంచి చింతలపాలెం వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. స్వల్పంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనలో బస్సులో ఐదు టికెట్ రోల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సంఘటనా స్థలాన్ని జరుగుమల్లి ఎస్సై ఐవీ వెంకటేశ్వరరావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా శక్తిని ప్రదర్శిద్దాం

- వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం



శచీదేవికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మహిళలు

**ఒంగోలు:** మహిళా శక్తిని ప్రదర్శించి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని బాలినేని సతీమణి శచీదేవి, వారి కోడలు శ్రీకావ్య పిలుపునిచ్చారు. స్థానిక మంగమూరు డొంకలోని కళానికేతన్ షోరూం దగ్గర ఉన్న ప్రజలతో ఆదివారం 'మహిళలతో మమేకం..స్త్రీ శక్తితో శచీదేవి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబం బాగుంటేనే దేశం బాగుపడుతుందని నమ్మి పథకాలన్నీ మహిళలకే కేటాయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అన్నారు. అటువంటి ముఖ్యమంత్రి నాయకత్వంలో మన నియోజకవర్గంలో కూడా పథకాలతోపాటు పదవుల విషయంలోను మహిళలకు దక్కేందుకు కృషిచేస్తున్న వాసన్నను గెలిపించుకోవడం ద్వారా మహిళా సాధికారతను మరింతగా సాధించుకుందామన్నారు. విశ్వసనీయతకు మహిళలు నిదర్శనమని, దానిని చూపించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. నేడు బిడ్డల చదువు మొదలు ప్రతి విషయంలోను కుటుంబాలకు ఇబ్బంది లేకుండా అండగా ప్రభుత్వం ఉంటోందన్నారు. ప్రతిపక్షాలు చేసే అవాస్తవాలను నమ్మకుండా మనకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ప్రతి ఒక్కరూ ఎంఎల్‌ఏ, ఎంపీకి ఓట్లు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక 36వ డివిజన్ కార్పొరేటర్ ఢాకా సుజాత హనుమారెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రేయింబవళ్లూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

- 23న సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ
- ముమ్మరంగా కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం



వెంగముక్కలపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజన్‌కుమార్

**ఒంగోలు సబర్బన్:** ఒంగోలు నగరంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ రేయింబవళ్లూ కొనసాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ నెల 23న పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇస్తున్న ఇళ్ల పట్టాలను ఒకేసారి లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల పేరుతో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి వేళ నగరంలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతున్న తీరును ఒంగోలు తహసీల్దార్ సుజన్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకంఠ శ్రీనివాసరావు(శ్రీశ్రీ), వీఆర్వో వెన్నపూస శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# బతుకు దీపం వెలిగించిన సుబ్బయ్య మాస్టర్



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సుబ్బయ్య స్కూల్ పూర్వ విద్యార్థులు

- ఘనంగా బీవీ సుబ్బయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం
- నాటి ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఒంగోలు టౌన్:** చదువు చెప్పడమే కాకుండా బతుకు పాఠాలను బోధించిన సుబ్బయ్య మాస్టారు రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని బీవీ సుబ్బయ్య ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు అరికట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అతిథి ఫంక్షన్ హాల్లో పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య ఉన్నత పాఠశాలకు చెందిన 190–91 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా సాగింది. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. పూర్తిగా వ్యాపారంగా మారిపోయిన విద్యారంగంలో బీవీ సుబ్బయ్య మాస్టరు అరుదైన వ్యక్తి అని కొనియాడారు. లాభాపేక్ష లేకుండా స్కూల్ నడిపారని, క్రమశిక్షణ, నైతిక విలువలు బోధించి తామంతా జీవితంలో ఉన్నతంగా స్థిరపడటానికి దోహదపడ్డారని పేర్కొన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయులు నల్లూరి కృష్ణారావు, కేవీ శేషయ్య, మోహన్‌రావు, ఆరికట్ల రమణయ్య, వీఎస్ ఆర్, ప్రస్తుత హెచ్‌ఎం హెచ్‌ఎం వెంగళరావు, పూర్వ విద్యార్థులు మిరియాల హరిబాబు, వాడా మనోహర్ రెడ్డి, గొల్లపూడి సుబ్బారావు, ఈదర విష్ణువర్ధన్, పుచ్చకాయల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### మినీ స్టేడియానికి 50 బెంచ్‌ల బహూకరణ



బొమ్మరిల్లు హోం చిన్నారులకు నిత్యావసరాలు అందిస్తున్న జేసీఐ నాయకులు

**ఒంగోలు:** జేసీఐ అల్యూమినియం క్లబ్ రాష్ట్ర చైర్మన్ మణిదీప్తి, రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ భాస్కర్ నేతృత్వంలో ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో వాకర్స్ సేదతీరేందుకు 50 బెంచ్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నడకతో వివిధ రకాల రుగ్మతలను నియంత్రించవచ్చని, తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వాకర్స్‌కు అవసరమైన బెంచ్‌లు బహూకరించే అవకాశం తమకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్టేడియం చుట్టూ త్వరలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక బొమ్మరిల్లు హోం విద్యార్థులకు అవసరమైన నిత్యావసరాలను బహూకరించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సోమినేని సురేష్, జాతీయ మాజీ అధ్యక్షులు నైనాల రామకృష్ణ, డీఎస్‌డీఓ రాజేశ్వరి, అధ్యక్షుడు వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నాయకుల జీవితాలు తెలుసుకోవాలి



చిన్నారులతో కథలు చదివిస్తున్న దృశ్యం

**ఒంగోలు టౌన్:** చిన్నారులకు జాతీయ నాయకుల జీవితాల గురించి తెలిసి ఉండడం మంచిదని ఉపాధ్యాయుడు, కవి జాలాది మోహన్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది నాయకులు తమ జీవితాలు, కుటుంబాల కంటే దేశమే ముఖ్యమని తలపోశారని చెప్పారు. షహీద్ భగత్ సింగ్, అష్ఫాకుల్లాఖాన్ వంటివారు చిరు ప్రాయంలోనే ఉరిశిక్షలకు గురయ్యారన్నారు. జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిన జవహర్ లాల్ నెహ్రూ జైలులో ఉన్నప్పుడు తన కూతురు ఇందిరా ప్రియదర్శినికి రాసిన లేఖలు ఆ తరువాత కాలంలో చాలా ప్రసిద్ధి చెందాయని తెలిపారు. వాటిని తెలుగులో ''చిరంజీవి ఇందిరకు'' అనే పేరుతో కాటూరు వెంకటేశ్వరరావు అనువదించారన్నారు. చిన్నారులలో చరిత్ర, సైన్స్ పై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య సూచించారు. ఈ సందర్భంగా ''చిరంజీవి ఇందిరకు'' పుస్తకాన్ని పిల్లలకు పరిచయం చేశారు. అలాగే పుస్తకాల్లోని బొమ్మలను చూపిస్తూ పిల్లలకు కథలు చెప్పారు. మానవ పరిణామ క్రమాన్ని వివరించారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, స్టెల్లీ, టి.గోవిందమ్మ, యం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఈ స్నేహం.. అ'పూర్వ'ం



ఆత్మీయ సమావేశానికి హాజరైన ఈతముక్కల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

- ఉత్సాహంగా ఈతముక్కల హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కొత్తపట్నం:** మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ హైస్కూల్ 1980–81 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఒంగోలులోని హోటల్ సరోవర్‌లో ఆదివారం ఉత్సాహంగా సాగింది. పూర్వ విద్యార్థి, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్నేహితులంతా కలుసుకుని సరదాగా గడిపారు. 43 మంది పూర్వ విద్యార్థుల్లో అడిగోపుల మాల్యాద్రి, మూనగాల రామకృష్ణారావు, జి.ఫణికుమార్, ఎం.గౌరి అనారోగ్యంతో మరణించగా, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులర్పించారు. స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడగా, మున్సిపల్, డీఆర్‌డీఏలో ఇంకొందరు పనిచేస్తున్నారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమ పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి చేయించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ఎస్‌ఆర్‌ఐ ఎస్.రవిచంద్రారెడ్డి, రాయల్‌బాబు, ఎస్‌వీ రమేష్, ఎ.వెంకట్రావు, దీన్ దయాల్ రాజు, ఎ.పద్మ, లింగారెడ్డి ఇందిర, రోహిణి, బలగాని శ్యామల తదితరులు పాల్గొన్నారు.

### 34 మందికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు

- బాధితులకు రూ.38.99 లక్షల మేర లబ్ధి
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వెల్లడి



**టంగుటూరు:** కొండపి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 34 మందికి 38.99 లక్షల రూపాయలు మంజూరయ్యాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితుడినైన తర్వాత సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నూతన దరఖాస్తులతోపాటు గతంలో వివిధ లోపాలతో తిరస్కరించిన దరఖాస్తులను సరిచేయించి నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి వివరించారు. గత నెలలో ఆరుగురికి రూ.7.85 లక్షలు అందించినట్లు తెలిపారు. తాజాగా కొండపి మండలంలో ఆరుగురికి రూ. 7.98 లక్షలు, మర్రిపూడి మండలంలో ఆరుగురికి రూ.6.10 లక్షలు, పొన్నలూరు మండలంలో నలుగురికి రూ.3.68 లక్షలు, సింగరాయకొండ మండలంలో ఏడుగురికి రూ.4.77 లక్షలు, టంగుటూరు మండలంలో ఇద్దరికి రూ.3.70 లక్షలు, జరుగుమల్లి మండలంలో 8 మందికి రూ.12.11 లోలు, కందుకూరులో ఒకరికి రూ.70 వేలు మంజూరయ్యాయని వెల్లడించారు.

**నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**సింగరాయకొండ(మర్రిపూడి):** సింగరాయకొండ మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి ఆదిమూలపు సురేష్ పంపిణీ చేస్తారని పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# రోగులకు పండ్లు పంపిణీ



డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ రావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

**ఒంగోలు సబర్బన్:** వైఎస్సార్‌సీపీ నాయకుడు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. వెలనాటి తన అనుచరులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ గంగాడ సుజాత తన ఛాంబర్‌లో వెలనాటి చేత కేక్ కట్ చేయించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్లు ఈదర సురేష్, చింతపల్లి గోపీచంద్, గిరిజా శంకర్ శాండిల్య, కృష్ణ లతతో పాటు పలువురు ఉన్నారు.

# కఠారి శంకర్‌కు పార్టీ శ్రేణుల శుభాకాంక్షలు



కఠారి శంకర్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు

**ఒంగోలు సబర్బన్:** వైఎస్సార్‌సీపీ ఒంగోలు నగర పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన కఠారి శంకర్‌ను ఆ పార్టీ నేతలు ఆదివారం కలిసి అభినందించారు. స్థానిక వీఐపీ రోడ్డులోని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి నివాసంలో కఠారి శంకర్‌ను వైఎస్సార్‌సీపీ 47వ డివిజన్ అధ్యక్షుడు చావలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు డివిజన్ల పార్టీ అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని, రానున్న ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి అఖండ విజయానికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పూర్ణ చంద్రారెడ్డి, చింతలపూడి నాగబాబు, గంగాడి శ్రీనివాసరావు(బుష్), సూర్య రాజేష్, భాస్కర్, పిదపర్తి మధుసూదన్‌రెడ్డి, గునూపాటి వెంకారెడ్డి, పసుపులేటి వీరభద్రరావు, సుబ్బయ్య, జల్లిపల్లి సురేష్ ఉన్నారు.

# ముస్లింలకు అండగా ఉంటా



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్
- షాదీఖానా, ఆటో నగర్ ఏర్పాటుకు హామీ

**సింగరాయకొండ(మర్రిపూడి):** ముస్లింలకు అండగా ఉండి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని షాదిఖానాలో ఆదివారం రాత్రి ముస్లింలతో ఆత్మీయ సమావేశంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. ముస్లిం మత పెద్దలు కోరినట్లుగా షాదిఖానా అభివృద్ధికి సుమారు 70 లక్షల రూపాయలు అవసరమని ఆ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. రూ.10 లక్షలతో ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేస్తామని, ముస్లింలకు గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లింమైనారిటీల నివాస ప్రాంతాల్లో ఇంకా అవసరమైన చోట రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పారు. ముస్లిం మహిళలకు రెండు విడతల్లో తన సొంత నిధులతో 20 కుట్టుమిషన్లు అందిస్తానని ప్రకటించారు. ముస్లింల శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి భరోసా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ.. ఇచ్చిన మాట నెరవేర్చడమే తన నైజమని స్పష్టం చేశారు. ముస్లింల చిరకాల స్వప్నమైన ఆటోనగర్ ఏర్పాటు చేసి, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ముస్లిం నేతలు మంత్రి సురేష్‌ను గజమాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ సలీం, షేక్‌ఇస్మాయిల్, షేక్ సుల్తాన్, షేక్ కరీం, పండ్లకొట్టు బాషా, షేక్ అబ్దుల్లా, షేక్ ముజీబ్, షేక్ ఇంతియాజ్, పఠాన్ రియాజ్, షేక్ కరిముల్లా, షేక్ జావిద్, షేక్ మస్తాన్, షేక్ గౌస్, షేక్ అబ్దుల్ మజీబ్ పాల్గొన్నారు.

### అయోధ్య బయలుదేరిన వీహెచ్‌పీ కార్యకర్తలు



అయోధ్యకు బయలుదేరిన విశ్వహిందూ పరిషత్ సభ్యులు

**ఒంగోలు మెట్రో:** అయోధ్య శ్రీ బాల రాముని దర్శనార్థం ఆదివారం విశ్వ హిందూ పరిషత్ ప్రకాశం విభాగ్ (విశ్వహిందూ పరిషత్ ఒంగోలు జిల్లా, మార్కాపురం జిల్లా) కార్యకర్తలు 70 మంది రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు 'ఆస్తా' ద్వారా అయోధ్య బయలుదేరారు. విశ్వహిందూ పరిషత్ ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన కార్యకర్తలు పలికిన జై శ్రీరామ్ నినాదాలతో ఒంగోలు రైల్వే స్టేషన్ మార్మోగింది. దక్షిణాంధ్రా కార్యకర్తలను కలుపుకొంటూ విజయవాడ నుంచి బయలుదేరిన రైలు గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్ నగర్, కాచిగూడ, కాజీపేట, బలార్షా, గూండియా, బాలాఘాట్, జబల్పూర్, కట్ని, మణిక్ పూర్, ప్రయాగ్ రాజ్, జవున్ పూర్, షాగంజ్ మీదుగా అయోధ్య ధామ్ స్టేషన్ చేరుతుందని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. హిందువుల 500 సంవత్సరాల ఎదురు చూపుల తర్వాత అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ అనంతరం అయోధ్య ప్రయాణం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, ఎందరో త్యాగధనుల ఫలితం, న్యాయమైన తీర్పు రాకతో మన సమకాలిన కాలంలో దివ్యమైన భవ్య రామమందిరం నిర్మాణమవడం మన అదృష్టమని పేర్కొన్నారు. అయోధ్య నుంచి తిరుగు ప్రయాణం ఈనెల 23వ తేదీ ఉదయం ఒంగోలు చేరుతామని వివరించారు.